**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 07.06.2026** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రంలో ఎక్కడ చర్చ పెట్టినా ఏ అంశం పైన అయినా చర్చించడానికి తాను సిద్ధమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.
2. రాష్ట్రంలో పాఠశాలలు ఈనెల 12వ తేదీకి బదులు 15వ తేదీన పునః ప్రారంభం అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది.
3. టీజీ పాలిసెట్-2026 తొలి దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది.
4. రాష్ట్రంలో రానున్న ఏడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

.........................................................

**కిషన్‌రెడ్డి**

ఏ అంశం మీద ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడబోరని వ్యాఖ్యానించారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేవారు తెలంగాణలో ఇంకా పుట్టలేదన్నారు. రేవంత్‌రెడ్డిలా తాను పార్టీలు మారలేదని, తన పుట్టుక.. చావు.. రెండూ బీజేపీలోనే అని స్పష్టం చేశారు. తానేంటో తెలంగాణ ప్రజలకు తెలుసునని, ఎంత రెచ్చగొట్టినా

తొందరపడనన్నారు. ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేవంత్ రెడ్డికి హితవు పలికారు.

.....డెస్క్

**వంజరి కుల ఆత్మగౌరవ భవనం**

హైదరాబాద్ - ఉప్పల్ భగాయత్‌లో వంజరి కుల ఆత్మగౌరవ భవనాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని బలహీన వర్గాల అభివృద్ధికి అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

....డెస్క్

**స్కూల్స్**

రాష్ట్రంలో పాఠశాలలు ఈనెల 12వ తేదీకి బదులు 15వ తేదీన పునః ప్రారంభం అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. వేసవి సెలవుల అనంతరం 12న పాఠశాలలు తిరిగి తెరుచుకోవాల్సి ఉంది. అయితే, ఈనెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులు పొడిగించాలని విద్యాశాఖ నిర్ణయించింది.

.....డెస్క్

**ముఖ్యమంత్రి**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిసేపటి క్రితం ఉప్పల్ బయలుదేరారు. కాసేపట్లో ఉప్పల్ భగాయత్ లే అవుట్ లో 1,511 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. 10 ఎకరాల్లో 98 కోట్ల రూపాయలతో నిర్మించే మల్కాజ్ గిరి మునిసిపల్ కార్పోరేషన్ భవన నిర్మాణానికి, 960 కోట్ల రూపాయలతో ఏఓసి సెంటర్ లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి, 416 కోట్ల రూపాయలతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్ లో 6 లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి, 37 కోట్లకు పైగా నిధులతో 100 పడకల మల్కాజ్ గిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

.......డెస్క్

**చేపమందు - ట్రాఫిక్**

హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రేపు చేప ప్రసాదం పంపిణీ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. రేపు ఉదయం 6గంటల నుంచి ఎల్లుండి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పేర్కొన్నారు. బస్సులు, వ్యాన్లలో వచ్చే వారు గాంధీభవన్, గృహకల్ప బస్టాప్‌ల నుంచి రావాలని సూచించారు.

......డెస్క్

**పాలిటెక్నిక్**

టీజీ పాలిసెట్-2026 తొలి దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో మొత్తం 81 వేల 307 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, తొలి దశలో 29 వేల 229 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేశారు.

.....డెస్క్

**ఫీజులు**

రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి నాలుగున్నర సంవత్సరాల ఫీజు మాత్రమే తీసుకోవాలని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తమ నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని పలు కళాశాలలపై తల్లిదండ్రులు ఇటీవల ఫిర్యాదులు చేశారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం కాలేజీలు నాలుగున్నర సంవత్సరాలే ఫీజులు తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది.

.....డెస్క్

**భట్టి ఖమ్మం**

అభివృద్ధి పనులు నాణ్యతతో గడువులోగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా

భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ముదిగొండ మండలంలో 33 కోట్ల రూపాయలతో చేపట్టిన రహదారుల నిర్మాణం పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు జాతీయ రహదారులతో అనుసంధానం బలోపేతం కానుందని పేర్కొన్నారు.

...పిటిసి, ఖమ్మం

**జలమండలి కార్మిక సంఘం**

జలమండలి కార్మిక సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ ప్రతినిధులను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అభినందించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఐఎన్‌టీయూసీలో కాంగ్రెస్ జెండా ఎగరేశామని, రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

. ....డెస్క్

**నిర్మాణాలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 8 వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఆదేశించారు.

.....డెస్క్

**ఇసుక**

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి వివేక్ ఆదేశించారు.

.........డెస్క్

**కవిత**

సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చేరు ప్రాంతం కాలుష్య మయంగా మారిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ సందర్భంగా కవిత జెండా ఎగరవేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ వనరులు కాపాడుకునేందుకు తమ పార్టీ కృషి చేస్తుందన్నారు.

......SANGATEDDY PTC

**పాయల్ శంకర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ ఈరోజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.

.....పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**వాతావరణం**

రాష్ట్రంలో రానున్న ఏడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈరోజు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి అన్ని జిల్లాల్లో ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

.......పీఎన్

**మహిళా డ్రైవర్లు**

మహిళా ప్రయాణికులు ఇకపై మహిళలు నడిపే కార్లు, ఆటోలు, బైక్‌లపైనే ప్రయాణించొచ్చు. ఇందుకోసం హైదరాబాద్‌లో 55 మంది మహిళా డ్రైవర్లు అందుబాటులోకి వచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.

......డెస్క్

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

వేములవాడలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు నిఫ్ట్ పీజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి ఎస్ ఆర్ శర్మ తెలిపారు. విద్యా, సృజనాత్మక, సాంస్కృతిక రంగాల్లో సైతం పలువురు ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

.......పి టి సి,రాజన్న సిరిసిల్ల జిల్లా

**ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుక**

ఐఐటీ హైదరాబాద్‌లో ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకల్లో 200 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఎస్. మూర్తి మాట్లాడుతూ... సైక్లింగ్ కేవలం శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికే కాకుండా, కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సైక్లింగ్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

......పిటిసి, సంగారెడ్డి